సాక్షి
మహబూబాబాద్
శనివారం | 13 | జనవరి | 2024



కేయూ అవగాహన ఒప్పందం

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన కాకతీయ యూనివర్సిటీ.. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

- 10లో▸



భక్తుల బాధలకు చెల్లు

ఐనవోలు మల్లికార్జున స్వామివారి ఆలయానికి సంబంధించి పదేళ్ల తరువాత తొలి ఫెస్టివల్ కమిటీ ఏర్పడింది.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
34.8°/17.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు కాస్త మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మహబూబాబాద్: సాగునీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని నీటి పారుదల శాఖ మానుకోట సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీరింగ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 1న ఎస్సారెస్పీ స్టేజ్–1 డీబీఎం 48 కాల్వల ద్వారా, ఈనెల 8న ఎస్సారెస్పీ స్టేజ్–11 డీబీఎం 60కాల్వల ద్వారా జిల్లా పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుల చేశామన్నారు. శ్రీరాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, ఇతర రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత లేనందున చివరి ఆయకట్టుకు సరిపడా సాగునీటిని సరఫరా చేయలేమన్నారు. కాగా కాల్వల చివరి ఆయకట్టు రైతులు బోర్లు, బావుల సదుపాయం ఉంటే ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడొద్దని సూచించారు.

ఆరోగ్య సమస్యలు గుర్తించాలి



నెహ్రూసెంటర్: పాఠశాలల పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించి జిల్లా కేంద్రంలోని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు పంపించాలని డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈఐసీ సెంటర్‌కు పిల్లల్ని తీసుకువచ్చి స్క్రీనింగ్ చేయాలని, పుట్టుకతో వచ్చిన రుగ్మతలను గుర్తించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి విజయ్‌కుమార్, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, డ్రైక్ సిబ్బంది పాల్గొన్నారు.

మానుకోట మున్సిపాలిటీకి 35వ ర్యాంకు

మహబూబాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2022–23లో భాగంగా సౌత్ జోన్‌లో మానుకోట మున్సిపాలిటీకి 35వ ర్యాంకు వచ్చినట్లు మున్సిపల్ పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50,000 నుంచి 1,00,000 జనాభా కలిగిన మున్సిపాలిటీల విభాగంలో ఆరో ర్యాంకు వచ్చినట్లు చెప్పారు. 2021–22 సంవత్సరంలో 62వ ర్యాంకు రాగా.. ప్రస్తుతం 35వ ర్యాంకు రావడంపై మున్సిపల్ అధికారులు, పాలక మండలి హర్షం వ్యక్తం చేస్తోంది.

షూటింగ్‌బాల్ క్రీడలో రాణిస్తే ఉపాధి..



తొర్రూరు: షూటింగ్‌బాల్ క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏపీలోని విజయవాడలో ఈ నెల 14వరకు జరిగే సౌత్ జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు క్రీడాకారులకు శుక్రవారం డివిజన్ కేంద్రంలో క్రీడాదుస్తులు అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో తెలంగాణ పేరును నిలిపేలా పోటీల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. షూటింగ్‌బాల్ క్రీడకు రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందన్నారు. క్రీడలో రాణిస్తే 2 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ రంగాల్లో వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెడుపల్లి ఐలయ్య, క్రీడా ప్రోత్సాహకులు జనార్దన్‌రాజు, గణపురం సోమయ్య, దాస్, ముఫాజిల్, మునీరుద్దీన్, మంజునాథ్, కోచ్ ఉషా తదితరులు పాల్గొన్నారు.


రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు

కేసముద్రం: గత వానాకాలం సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) పెట్టని రెండు రైస్ మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సాయి రాఘవ, శ్రీనివాస రైస్ మిల్లులకు ప్రభుత్వం గత వానాకాలం సీఎంఆర్ కింద ధాన్యాన్ని అందించింది. అయితే ప్రభుత్వానికి సకాలంలో బియ్యం పెట్టకపోవడంతో సివిల్‌సప్లయీస్, విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ మేరకు మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడం, బియ్యం పెట్టకపోవడంతో పౌరసరఫరాల శాఖ డీఎం క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రైస్ మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాత కమిటీలతోనే సరి

ఎస్‌ఎంసీ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

- మరో 6 నెలల గడువు పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు
- నాలుగేళ్లుగా పాతవారే కొనసాగింపు
- పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ





జమస్తాన్‌పురం ప్రాథమిక పాఠశాల



తొర్రూరు మండలం కొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ సమావేశం (ఫైల్)

తొర్రూరు: పాఠశాలల బలోపేతంతో పాటు విద్యాభివృద్ధిలో భాగస్వాములవుతున్న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) పాలకవర్గాల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడగించింది. నిబంధనల ప్రకారం ప్రతీ రెండేళ్లకోసారి కమిటీలను ఎన్నుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. తాజాగా 2023 నవంబర్ నాటికి రెండేళ్లు పూర్తయినప్పటికీ మరో ఆరు నెలలు పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రధాన భాగస్వాములు..

తల్లిదండ్రులు పాఠశాలల నిర్వహణలో ప్రధాన భాగస్వాములు కావాలనే విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్‌ఎంసీలను ఏర్పాటు చేశారు. ఆ బడిలో చదివే తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. రెండేళ్లు పదవిలో కొనసాగుతారు. ఎప్పుడైనా ఆ సభ్యుడి పిల్లలు పాఠశాలను వదిలి వెళ్లినట్లయితే ఆ సభ్యుడు పదవి కోల్పోతాడు.

ప్రత్యేక సమావేశం..

కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధి విధానాలను వివరించి మొదట ప్రతి తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎక్కువ మంది పోటీలో ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ టీచర్, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు. నాలుగేళ్ల నుంచి ఎస్‌ఎంసీ ఎన్నికలు లేకపోవడంతో ఆ పాఠశాలల్లో చదివేవారు వేరే బడుల్లోకి వెళ్లినా పాతవారే కొనసాగుతున్నారు. దీంతో పర్యవేక్షణ కరవైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చాలా కీలకం..

చైర్మన్, వైస్ చైర్మన్ ప్రతీరోజు విధిగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మూత్రశాలలు, శుద్ధినీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలి. ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. నిర్వహణ నిధులను హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌ల జాయింట్ ఖాతాలో వేస్తారు. వీటిని సక్రమంగా వినియోగించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

ఎస్‌ఎంసీ గడువును మరోసారి ఆరు నెలల పాటు పొడగిస్తూ విద్యాశాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. కొత్త కమిటీల ఎన్నికలపై ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

– రామారావు, డీఈఓ

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో సిబ్బందికి కేటాయించే విధులపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల పోలింగ్ సిబ్బంది, సీపీఓ, ఈవీఎంల నిర్వహణ అదనపు కలెక్టర్ డేవిడ్ చూసుకోవాలన్నారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాల నిర్వహణ ఉద్యానశాఖ అధికారి సూర్యనారయణకు కేటాయించాలన్నారు. అలాగే ఎన్నికల ఖర్చు, వ్యయాలను డీసీఓ ఖుర్షీద్‌కు అప్పగించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, పీడబ్ల్యూడీ హోం ఓటింగ్ కార్యక్రమాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనులు పూర్తిచేయాలి

మెడికల్ కళాశాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మెడికల్ కాలేజీ పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఎకరాల్లో రూ.510 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థుల కోసం వసతి గృహాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు నాణ్యతతో ఉండాలని, అధికారులు పర్యవేక్షించాలన్నారు.

కృషి చేయాలి

విద్యావ్యవస్థ పటిష్టతకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యలో నిరంతర ప్రగతి కనిపించాలని, అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ రామారావు, డీఐఈఓ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు అభయహస్తం పథకాలు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: అర్హులకు అభయహస్తం పథకాలు అందుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకుముందు అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామన్నారు. మాటల్లో కాదు చేతల్లో చూపించాలనే నిబద్ధతతో పని చేస్తామన్నారు. గుర్తూరులో 74ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అతి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని, నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వం ఆరున్నర లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని, రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిందన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వప్రకాశాచార్యులు, ఆలయ అధ్యక్షుడు కల్లూరి నాగేంద్రాచారి, అర్చకులు విక్రమ్ శర్మ, ప్రతినిధులు పూర్ణాచారి, చంద్రశేఖరాచారి, సదానందచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి కోరారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. పీఆర్‌సీని ప్రకటిస్తూ భాషా పండితులు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ట్రెజరీలో ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేయాలని కోరారు. వెంటనే రెగ్యులర్ ఎంఈఓల నియామకాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి నర్సింహారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, జిల్లా కార్యదర్శి నామా వెంకటేశ్వర్లు, ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

నిధుల ప్రకటన ఎన్నికల జిమ్మిక్కు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్, పక్కన ఎమ్మెల్సీ రవీందర్‌రావు, చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- గత ప్రభుత్వం ప్రకటించిన రూ.50కోట్ల నిధులపై తీవ్ర చర్చ
- గరంగరంగా మానుకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



హాజరైన కౌన్సిలర్లు

మహబూబాబాద్: గత ప్రభుత్వం మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్ల నిధులు ప్రకటించి, విడుదల చేయలేదని, అంతా ఎన్నికల జిమ్మిక్కు అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని, మున్నేరువాగు నుంచి తాగునీటిని వాడుకోవాలన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి..

మొదటిసారిగా వచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సమస్యలు తెలియజేయడానికి సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, పలు విభాగాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పోస్టుల భర్తీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కృషి చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కేటాయించిన రూ. 50 కోట్ల నిధుల విడుదలకు పాటుపడాలన్నారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు కృషి చేయాలన్నారు. ఈదుల పూసపల్లి రోడ్డు, పత్తిపాక రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేందుకు సహకరించాలని కోరారు. మిషన్ భగీరథ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, రింగ్ రోడ్డుకు అన్ని విధాలా సహకరించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య కోరారు. నిజాం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్ డిమాండ్ చేశారు. రోడ్డు లేక గోపాలపురం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిదీపాల సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మాజీ సీఎం ప్రకటించిన రూ.50 కోట్లలో విలీన గ్రామాలకు రూ. కోటి చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జీఓ 3 విడుదల చేసి మున్సిపాలిటీల పాలకమండలిలకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 122ను రద్దు చేయాలన్నారు. కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు మాట్లాడుతూ .. ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. గ్రీన్‌ల్యాండ్లను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇతర కౌన్సిలర్లు హరిసింగ్, భూక్య శ్రీను, మార్నేని శ్రీదేవి వారి వార్డుల్లోని సమస్యలపై మాట్లాడారు.

ప్రతీ నెల జనరల్ బాడీ సమావేశం..

ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. ప్రతి నెల జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలన్నారు. జీఓ 122 వల్ల నష్టమేనని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రద్దుకు కృషి చేస్తానన్నారు. మానుకోట శివారులోని ఆర్వోబీ శిథిలావస్థకు చేరిందని, మంత్రి దృష్టికి తీసుకెళ్లి మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయిస్తానన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. కుంటలు, చెరువుల సుందరీకరణపై దృష్టి పెట్టాలని, కబ్జాకు గురైన చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. మానుకోట శివారు మున్నేరు వాగును తాగునీటి కోసం ఉపయోగించుకోవాలని, మిషన్ భగీరథపై ఆధారపడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అన్ని విధాలా సహకరిస్తాం..

మానుకోట పట్టణ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.50కోట్ల నిధుల జీఓ విడుదల చేసినప్పటికీ.. పనుల్లో ఆలస్యం కావడం వల్లే నిధులు విడుదల కాలేదన్నారు. అనుమతుల లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుని ఇల్లు లేని పేదలకు కేటాయించి పట్టాలు ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎజెండాలోని 96 అంశాలలో 93 తీర్మానం చేసి మూడు పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు తెలిపారు. కాగా మున్సిపల్ సమావేశానికి మొదటిసారి వచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో పాటు ఎమ్మెల్సీ రవీందర్‌రావును మున్సిపల్ చైర్మన్, కమిషనర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు ఘనంగా సన్మానించారు. కమిషనర్ ప్రసన్న రాణి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, టీపీఓ నవీన్, మేనేజర్ శ్రీధర్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు



మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగురోజులు సెలవులు ఇచ్చామని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. శని, ఆదివారాలు వారంతపు సెలవులని, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ సందర్భంగా మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు.

కేసముద్రం మార్కెట్‌కు..

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ సందర్భంగా మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

మేడారం జాతరకు ఆర్టీసీ సమాయత్తం!

వచ్చే నెల 21నుంచి 24 వరకు జాతర

- మహిళలకు ఉచిత ప్రయాణంతో ఈసారి భక్తులు పెరుగుతారని అంచనా
- జాతర కోసం 4వేల నుంచి 6 వేల బస్సులు
- 47 ఎకరాల్లో బస్టాండ్ ఇతర కౌంటర్ల ఏర్పాట్లు
- 42 క్యూ రెయిలింగ్‌లు.. చురుగ్గా సాగుతున్న పనులు
- మరో 10 నుంచి 20 ఎకరాల స్థలం అవసరమని ప్రతిపాదన
- తాడ్వాయిలో 10 ఎకరాల్లో పార్కింగ్



క్యూ రెయిలింగ్ పనులు పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు



మేడారంలోని ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీలు, డోజర్లు

హన్మకొండ: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ఆర్టీసీ సమాయత్తమవుతోంది. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. గత జాతర వైఫల్యాలు సమీక్షించుకుంటూ, ఈసారి పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 21, 22, 23, 24 తేదీల్లో వనదేవతల జాతర జరగనుంది. జాతర భక్తులను చేరవేసేందుకు వారం రోజుల ముందునుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి బస్సులు నడిపేలా కార్యాచరణ సిద్ధం చేశారు. గత జాతరకు ఆర్టీసీ బస్సుల ద్వారా 25 లక్షలకు పైగా భక్తులను చేరవేయగా, ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఈసారి భక్తులు పోటెత్తుతారని ఆర్టీసీ భావిస్తోంది. 4 వేల ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులు ముందుగా అనుకున్నారు. కానీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో 6 వేల ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి మొత్తం 50కి పైగా ప్రత్యేక బస్ పాయింట్ల నుంచి భక్తులను మేడారానికి చేరవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బస్ పాయింట్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు.

కార్మికులకు సకల సౌకర్యాలు

బస్సుల సంఖ్య పెంచితే కార్మికులు పెరగనున్నారు. ఈ క్రమంలో గతంలో రెండు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయగా ఈసారి 4 ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కమాండ్ కంట్రోల్ రూమ్, కార్మికులకు 120 రెస్ట్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క రూంలో 15 మంది సిబ్బంది ఉండేందుకు వీలుగా వీటిని నిర్మిస్తున్నారు. బస్టాండ్‌లో బస్సుల కోసం వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణికులకు బోర్ కొట్టకుండా ఉండేందుకు, బస్సుల వివరాలు తెలిపేందుకు రెండు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

మేడారంలో బస్టాండ్ క్యూ రెయిలింగ్ పనులు

మేడారంలో ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జేసీబీలు, డోజర్‌లతో స్థలాన్ని చదును చేస్తున్నారు. దీంతోపాటు క్యూ రెయిలింగ్ పనులు చేస్తున్నారు. మొత్తం 47 ఎకరాల విస్తీర్ణంలో బస్‌ల పార్కింగ్, బస్‌ల మరమ్మతుల షెడ్, కార్మికులు, అధికారులకు వసతి, తాగునీటి సౌకర్యం, క్యాంటిన్, మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు, ప్రయాణికులు బస్సులు తిరిగి వెళ్లే క్రమంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులు బస్సులోకి చేరేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులు ఎక్కేందుకు 42 క్యూ రెయిలింగ్‌లు నిర్మిస్తున్నారు. వీటిని మరో 6 పెంచాలని ఆలోచనలో అధికారులున్నారు. భక్తులు ఒక్కసారిగా తిరుగు ప్రయాణానికి వస్తే వెంట వెంటనే బస్సులు సమకూర్చేందుకు తాడ్వాయి వద్ద 10 ఎకరాల్లో పార్కింగ్‌తోపాటు టికెట్ జారీ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో ప్రత్యేక బస్సులు సంఖ్య 4 వేల నుంచి 6 వేలకు పెంచనుండడంతో మేడారంలో అదనంగా 10 నుంచి 20 ఎకరాల స్థలం అవసరం కానుంది. తమకు కావాల్సిన 20 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి, జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆర్టీసీ అధికారులు కోరారు.

ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి..



మేడారంలో జాతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని చదును చేయడంతోపాటు, వసతి, పార్కింగ్, గ్యారేజీ, ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు క్యూ రేయిలింగ్ పనులు నడుస్తున్నాయి. సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులను క్షేమంగా చేరవేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

– ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం జాస్తి శ్రీలత

క్లుప్తంగా

20న జాకారంలో మెగాజాబ్‌ మేళా

● ఐటీడీఏ పీఓ అంకిత్‌

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ములుగు మండలం జాకారం వైటీసీలో ఈనెల 20వ తేదీన మెగా జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌ మేళాలో 20 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని, రూ.15 వేలు నుంచి రూ. 30వేల వరకు వేతనం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఫార్మసీ, ఎంబీఏ, బీటెక్‌ చదివి ఉండాలన్నారు. 18 నుంచి 35 వయసు గల వారు అర్హులన్నారు. తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్‌ పత్రాలను వెంట తీసుకుని 20వ తేదీ ఉదయం 10 గంటలకు జాకారం వైటీసీకి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 8008932159, 79816 33716 సంప్రదించాలన్నారు.

మూడో రైల్వే లైన్‌ నిర్మాణం పూర్తి

● నేడు తనిఖీ చేయనున్న కమిషనర్‌ ఆఫ్‌ రైల్వే సేఫ్టీ ఆఫీసర్‌

కాజీపేట రూరల్‌ : కాజీపేట సబ్‌ డివిజన్‌ పరిధిలోని ఉప్పల్‌-హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య పూర్తయిన మూడో రైల్వే లైన్‌ నిర్మాణాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే కమిషనర్‌ ఆఫ్‌ రైల్వే సేఫ్టీ ఆఫీసర్‌ తనిఖీ చేయనున్నట్లు రైల్వే ఇంజనీరింగ్‌ అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు. 2010-11 రైల్వే బడ్జెట్‌లో మంజూరైన బల్లార్షా-విజయవాడ మధ్య గల మూడో రైల్వే లైన్‌ నిర్మాణంలో భాగంగా 2016లో సుమారు 100 కిలోమీటర్ల వరకు మందమర్రి-హసన్‌పర్తి వరకు దశల వారీగా మూడో రైల్వే లైన్‌ నిర్మాణం చేపట్టారు. ఇటీవల ఉప్పల్‌-హసన్‌పర్తి మధ్య 10 కిలోమీటర్ల వరకు నిర్మించిన థర్డ్‌లైన్‌ను రైల్వే సేఫ్టీ కమిషనర్‌ తనిఖీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ట్రాక్‌ అన్ని విధాలా సరిగా ఉంటేనే ఫిట్‌ సర్టిఫికెట్‌ ఇవ్వనున్నారు. ట్రాక్‌ ఫిట్‌ సర్టిఫికెట్‌ ఇస్తే మందమర్రి-హసన్‌పర్తి వరకు థర్డ్‌లైన్‌ అందుబాటులోకి వస్తుంది. దీంతో కొత్తఢిల్లీ-విజయవాడ, హైదరాబాద్‌ మార్గంలో రైల్వే ట్రాఫిక్‌ సమస్య తగ్గనుందని రైల్వే అధికారులు తెలిపారు.

రైళ్లు.. రద్దీ



విజయవాడ వైపునకు వెళ్తున్న శాతవాహన రైలులో ప్రయాణికుల రద్దీ

దోర్నకల్‌: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రైళ్లన్నీ రద్దీగా నడుస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ వైపునకు వెళ్లే రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ శుక్రవారం సికింద్రాబాద్‌ నుంచి విజయవాడ మీదుగా శ్రీకాకుళం వరకు, శనివారం శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్‌ వరకు ప్రత్యేక రైలు నడుపుతోంది.

భక్తుల బాధలకు చెల్లు

'మల్లన్న' క్షేత్రంలో తొలి ఫెస్టివల్‌ కమిటీ | పదేళ్ల తర్వాత జాతర సమయంలో ఏర్పాటుకు ఆమోదం

- ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో కమిటీలు
- జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కృషితో అడుగులు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ



సాక్షి, వరంగల్‌: వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామివారి ఆలయానికి సంబంధించి పదేళ్ల తరువాత తొలి ఫెస్టివల్‌ కమిటీ ఏర్పడింది. ప్రజాప్రాతినిథ్యం లేకుండా ఈవోల సమక్షంలో ఐనవోలు మల్లన్న జాతర జరగడం సరికాదనే ఉద్దేశంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్‌ నాగరాజు, ప్రముఖ న్యాయవాది నామాని శేఖర్‌ రావు.. ఆలయంలో ఫెస్టివల్‌ కమిటీల ఏర్పాటు అంశం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, ధర్మకర్తల నియామక (1987) చట్టం అనుసరించి ఆలయాల్లో రెగ్యులర్‌ కమిటీ లేని సమయంలో పండుగ, జాతర, ఇలా ప్రత్యేక సందర్భాల్లో ఫెస్టివల్‌ కమిటీని నియమించొచ్చనే అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి కొండా సురేఖ వెంటనే ఈ ఫెస్టివల్‌ కమిటీ అంశాలను వివరిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీంతో 2014లో ఫెస్టివల్‌ కమిటీలపై హైకోర్టు విధించిన స్టేను ఆధారంగా చేసుకుని ఇంతకాలం అధికారులు ప్రజాప్రాతినిథ్యం లేకుండా చేయడంతో ఆడిందే ఆట...పాడిందే పాటగా మారింది. అయితే 2022లో ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు ఫెస్టివల్‌ కమిటీలు ఏర్పాటు చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకుని ప్రస్తుతం తెలంగాణలోనూ ఫెస్టివల్‌ కమిటీల నియామకానికి గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు. దేవాదాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌ శర్మ పేరుతో జీవో 4 ద్వారా శుక్రవారం ఆదేశాలిచ్చారు. దీని వల్ల ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో కూడా ఫెస్టివల్‌ కమిటీలు ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.

ఇక అన్ని ఆలయాలకు వర్తింపు ...

రాష్ట్రంలోని దాదాపు 90 శాతం ఆలయాల్లో రెగ్యులర్‌ కమిటీలు లేవు. అదే సందర్భంలో జాతర సమయంలో ఫెస్టివల్‌ కమిటీలు కూడా ఏర్పాటుచేయడం లేదు. దీంతో జాతరలో భక్తులకు సరైన సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. చాలా మంది ఈవోలు తమ అధికారం కొనసాగాలనే ఉద్దేశంతో ఈ ఫెస్టివల్‌ కమిటీల నియమాక జోలికి వెళ్లకుండా అంతా తమ కనుసన్నల్లోనే జరిగేలా వ్యవహరిస్తున్నారు. ఈ విధంగానే ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానానికి కూడా రెండేళ్లుగా రెగ్యులర్‌ కమిటీ లేకపోవడంతో జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈవో అంతా తానై వ్యవహరిస్తుండడంతో ప్రజాప్రతినిథ్యం ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నాగరాజు, ఆయన లీగల్‌ అడ్వయిజర్‌ నామాని శేఖర్‌ రావు.. ఫెస్టివల్‌ కమిటీల వల్ల భక్తులకు ఏర్పడే సౌకర్యాలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే కమిటీల ఏర్పాటు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఐనవోలు ఆలయ ఉత్సవ కమిటీ..

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి 7 రోజుల కాలవ్యవధికి సంబంధించి 15 మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ ఎండోమెంట్‌ కమిషనర్‌ వి అనిల్‌ కుమార్‌ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో రెన్నోవేషన్‌, పర్మినెంట్‌ కమిటీకి మాత్రమే అవకాశం ఉండగా ప్రభుత్వం జీఓ 4 ద్వారా తెలంగాణ ఎండోమెంట్‌ యాక్ట్‌కు సవరణ తీసుకువచ్చి ఉత్సవ కమిటీని వేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు జీవో 4ను అనుసరించి 15 మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఐనవోలు ఫెస్టివల్‌ కమిటీ సభ్యులు వీరే...

ఎద్దు సత్యనారాయణ, పాల్లెపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వరరావు, నునావత్‌ కీమా నాయక్‌, మజ్జిగ రాములు, గడ్డం శ్రీనివాస్‌, జెట్టబోయిన శ్రీనివాస్‌, ఒగ్గుల మాధవి, తాటికొండ కృష్ణమూర్తి, చెరుకొండ వెంకటేశ్వర్లు, కొండేటి మమత, కుసా చిరంజీవి, నాగబెల్లి మహేందర్‌, గురుమంచి వేణు గోపాలచారి, పాతరిపాటి రవీందర్‌.

ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఐనవోలు జాతరకు 15 మందితో కూడిన ఫెస్టివల్‌ కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ కమిషనర్‌ ఆమోదముద్ర వేశారు. దీంతో దాదాపు పదేళ్ల తర్వాత ఫెస్టివల్‌ కమిటీ ఏర్పాటైన తొలి దేవాలయంగా ఐనవోలు మల్లన్న క్షేత్రానికి పేరొచ్చింది. ఇప్పుడూ ఈ విధంగానే ఉమ్మడి వరంగల్‌ లోని మెట్టుగుట్ట, ఎర్రగట్టుగుట్ట జాతరతో పాటు వివిధ ఆలయాలకు జాతర, పండుగ సమయాల్లో తాత్కాలిక కమిటీల ఏర్పాటుకు అవకాశం ఏర్పడింది.

ఈ చట్టం ఏం చెబుతుందంటే...

తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, ధర్మకర్తల నియామకాల చట్టం (1987) ప్రకారం సాధారణ ధర్మకర్తల మండలి లేకున్నా.. కమిషనర్‌ నిర్దిష్ట సందర్భాలలో దేవాలయాలకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయొచ్చు. దాని సభ్యుల సంఖ్య ధర్మకర్తల మండలితో సమానంగా ఉంటుంది. చట్టంలోని సెక్షన్లు 18,19లో నిర్దేశించబడిన అర్హతలు, అనర్హతలు ఈ సభ్యులకు వర్తిస్తాయి.

ఎస్సీ వర్గీకరణ హామీ నెరవేర్చాలి

- మాట తప్పితే బీజేపీకి గుణపాఠం చెబుతాం
- ఎమ్మార్పీఎస్‌-టీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌



మాట్లాడుతున్న శ్రీనివాస్‌

హన్మకొండ : ఎస్సీ వర్గీకరణ చేపడుతామనే బీజేపీ హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్‌-టీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్‌-టీఎస్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వంగపల్లి శ్రీనివాస్‌ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్‌ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు గుణపాఠం చెబుతారన్నారు. మాదిగలను మోసం చేస్తే ఫలితం అనుభవిస్తారన్నారు. ప్రభుత్వం వృత్తి పనులు చేసుకునే వారికి పెన్షన్‌ ఇస్తుందన్నారు. అయితే డప్పులు కొట్టే వారికి, చెప్పులు కుట్టే వారికి మాత్రం పెన్షన్‌ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం డప్పు కొట్టే వారికి, చెప్పులు కుట్టే వారికి నెలకు రూ.5 వేల పెన్షన్‌ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని, దళితబంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, గతంలో ఎంపిక చేసిన వారికి వెంటనే సహాయం అందించాలన్నారు. అలాగే, మంత్రి వర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మార్పీఎస్‌-టీఎస్‌ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ ఖన్నా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి, ఆరేపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, ఎలుకటి రాజయ్య, గడ్డం భద్రయ్య, రాకేష్‌, సుధన్‌, అనిల్‌, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌ వైఖరిపై యూజీసీకి ఫిర్యాదు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీలో రెండున్నరేళ్లలో వీసీ, రిజిస్ట్రార్‌ అనుసరిస్తున్న వైఖరి, అలాగే, యూనివర్సిటీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఈనెల 5న యూజీసీకి ఫిర్యాదు చేసినట్లు కాకతీయ యూ నివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్‌) జనరల్‌సెక్రటరీ మామిడాల ఇస్తారి శుక్రవారం తెలిపారు. యూజీసీ వెంటనే స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న అవతకలపై వెంటనే రిపోర్ట్‌ పంపాలని కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ను కోరినట్లు తనకు ఈనెల 11న యూజీసీ డిప్యూటీసెక్రటరీనుంచి ఈమెయిల్‌ ద్వారా సమాచారం అందిందని ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రొఫెసర్‌గా పది సంవత్సరాల అనుభవం లేకున్నా కేయూ వీసీగా రమేష్‌ను నియమించడంతో యూనివర్సిటీలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. యూనివర్సిటీ చట్టానికి విరుద్ధంగా రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్‌ కాలేజీ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ కిష్టయ్యను క్యాంపస్‌కు బదిలీ చేయించుకుని, కీలక విభాగాల్లో ఒక్కడినే అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌గా నియమించి అక్రమాలకు తెరలేపారన్నారు. అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ లంచం తీసుకుంటూ ఏసీబీకి కూడా పట్టుబడ్డారని పేర్కొన్నారు. పలువురి అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ రొటేషన్‌గా వచ్చే విభాగాధిపతి, బీఓఎస్‌, తదితర పదవుల్లో తమకు ఇష్టం ఉన్న వారినే నియమిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనలపై యూజీసీ స్పందించి వెంటనే బాధ్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వరంగల్‌ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

వరంగల్‌ : ఏనుమాములలోని వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు వరుస సెలవు ఉన్నట్లు మార్కెట్‌ కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ శనివారం వారంతపు యార్డు బంద్‌, 14వ తేదీ ఆదివారం వారాంతపు సెలవు-భోగి పండుగ, 15వ తేదీ (సోమవారం) సంక్రాంతి పండుగ, 16వ తేదీ (మంగళవారం) కనుమ పండుగ సందర్భంగా నాలుగు రోజులు మార్కెట్‌ బంద్‌ ఉంటుందన్నారు. ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలను జరగవని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, అడ్తిదారులు, వ్యాపారులు, గుమస్తాలు, దడవాయిలతో పాటు కార్మికులు గమనించాలని కోరారు. తిరిగి 17వ తేదీన పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కేయూ అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు, కంపెనీ ప్రతినిధులు

కేయూ క్యాంపస్‌ : న్యాక్‌ ఏ ప్లస్‌ గ్రేడ్‌ కలిగిన కాకతీయ యూనివర్సిటీ.. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'ది ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కంపెనీ సెక్రటరీ ఆఫ్‌ ఇండియా'తో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన పత్రాలను కేయూ రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు , 'ది ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కంపెనీ సెక్రటరీ ఆఫ్‌ ఇండియా' ప్రతినిధి, ఆ సంస్థ సెంట్రల్‌ కౌన్సిల్‌ సభ్యుడు సీఎస్‌ రాజివోలు వెంకటరమణ కేయూ క్యాంపస్‌లో మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం వల్ల రెండు సంస్థలు అకడమిక్‌ పరంగా సహకరించుకుంటాయి. తద్వారా విద్యార్థులకు ఆ కంపెనీ సెక్రటరీ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది. ప్లేస్‌మెంట్స్‌ పొందేందుకు కూడా అవకాశం ఉంటుంది. ప్రస్తుత జాబ్‌ మార్కెట్‌ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉద్యోగావకాశాలుంటాయి. కార్యక్రమంలో కామర్స్‌అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంటు కళాశాల ప్రిన్సి పాల్‌ నర్సింహాచారి, డీన్‌ పి అమరవేణి, బీఓఎస్‌ చైర్మన్‌ కట్ల రాజేందర్‌, అధ్యాపకుడు ఫణీంద్ర, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ వల్లాల పృథ్వీరాజ్‌, 'ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ది కంపెనీ సెక్రటరీస్‌ ఆఫ్‌ ఇండియా' నుంచి హైదరాబాద్‌ చాప్టర్‌ చైర్‌ పర్సన్‌ సీఎస్‌ తంగిరాల లలితాదేవి, కోశాధికారి సీఎస్‌ మహాదేవ తిరునగరి, ఐసీఎస్‌ఐ, ఎస్‌ఐఆర్‌సీ సీఎస్‌ జీఎస్‌ఎల్‌గుప్తా , హైదరాబాద్‌ చాప్టర్‌ ఆఫీసర్‌ వి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవదానం.. పలువురికి ప్రాణదానం



శ్రీకాంతాచారి(ఫైల్‌)

గీసుకొండ: గీసుకొండ మండల కేంద్రానికి చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి (28) కొంతకాలంగా హైదరాబాద్‌ బంజారాహిల్స్‌లోని కేర్‌ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. వైరల్‌ ఫీవర్‌తో బాధపడుతుండగా మూడు రోజుల క్రితం అదే ఆస్పత్రిలో చేరగా బ్రెయిన్‌ డెడ్‌ అయినట్లు వైద్యులు నిర్ధారించారని బంధువులు శుక్రవారం తెలిపారు. ఆ యువకుడి తల్లిదండ్రులు బ్రహ్మచారి, సరస్వతి మానవతా దృక్పథంతో తమ కుమారుడి కంటి కార్నియా, గుండె, కిడ్నీలు, లివర్‌ తదితర అవయవాలను దానం చేయడానికి ముందుకు రాగా.. ఆస్పత్రి యాజమాన్యం వాటిని సేకరించి పలువురికి ప్రాణదానం చేశారు. స్వగ్రామం గీసుకొండలో సాయంత్రం శ్రీకాంతాచారి అంత్యక్రియలు జరిగాయి. రిటైర్డ్‌ స్టేట్‌ బ్యాంకు మేనేజర్‌ పెగళ్లపాటి లక్ష్మినారాయణ మృతుడి కుటుంబానికి రూ. 5 వేల సాయం అందించారు.

బోధనేతర విధుల నుంచి మినహాయించాలి

● పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి

విద్యారణ్యపురి: గురుకుల ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి మినహాయించాలని పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. శుక్రవారం హనుమకొండలోని న్యూసైన్స్‌ పీజీ కళాశాలలో పీఆర్‌జీటీఏ ఉమ్మడి వరంగల్‌ జిల్లా గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకుల సంయుక్త సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా బీసీ వెల్ఫేర్‌, జనరల్‌ సొసైటీల పాఠశాలల వేళలు మార్చాలన్నారు. డిప్యూటీ వార్డెన్‌ విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. కేర్‌టేకర్లను కౌన్సిలర్లుగా నియమించాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయ, అధ్యాపకులకు తదుపరి కేడర్‌లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్‌ చేశారు. పీఆర్‌జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్‌ మాట్లాడుతూ పీఆర్‌జీటీఏ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏజెండాగా రాష్ట్రంలో బలమైన ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూటీఎస్‌ మద్దతుతో ఏర్పడిందన్నారు. సమావేశంలో పీఆర్‌జీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం వేణుప్రసాద్‌, సెక్రటరీ స్వప్న, జాయింట్‌ సెక్రటరీలు ఉప్పు అశోక్‌, డాక్టర్‌ ఇ శ్రీనివాసచారి, డాక్టర్‌ ఐ నిర్మలానందం, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలు కె రామకృష్ణారెడ్డి, పి విద్యాసాగర్‌, పానుగంట విజయ్‌కుమార్‌, చీదేటి లక్ష్మారెడ్డి, చెలకాని సంజీవ రెడ్డి, ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి బి రాజు, ఉపాధ్యక్షుడు బి వనితారెడ్డి, వివిధ సొసైటీల విభాగాల రంగారెడ్డి, హైదరాబాద్‌, నల్లగొండ జిల్లాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ఉమ్మడివరంగల్‌ జిల్లా పీఆర్‌జీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉమ్మడి వరంగల్‌ జిల్లా పీఆర్‌జీటీఏ నూతన కార్యవర్గాన్ని ఈసమావేశంలో ఎన్నుకున్నారు. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ వరంగల్‌ జిల్లా అధ్యక్షురాలిగా ఆర్‌ శోభ, జనరల్‌సెక్రటరీగా జి సుధాకర్‌, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌గా వై రజిని, ఉపాధ్యక్షుడిగా సీహెచ్‌ శోభన్‌, సెక్రటరీగా ఆర్‌ స్వప్న ఎన్నికయ్యారు. ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్‌ వరంగల్‌ జిల్లా అధ్యక్షురాలుగా ఎ స్వేత, జనరల్‌ సెక్రటరీగా కె శ్రీనివాస్‌,అసోసియేట్‌ ప్రెసిడెంట్‌గా ఎస్‌ రజిత, ఉపాధ్యక్షురాలిగా బి నివేదిత, సెక్రటరీగా రమణారెడ్డి ఎన్నికయ్యారు. టీఎంఆర్‌ఈఐఎస్‌ వరంగల్‌ జిల్లా అధ్యక్షురాలుగా ఎస్‌ సౌజన్య, జనరల్‌సెక్రటరీగా జావీద్‌పాషా, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌గా పి శిరీష, ఉపాధ్యక్షులుగా బి రాజశేఖర్‌, సెక్రటరీగా నజియా తహసీన్‌ ఎన్నికయ్యారు. టీఆర్‌ఈఐఎస్‌వరంగల్‌జిల్లా అధ్యక్షురాలుగా జి ప్రియదర్శిని, జనరల్‌సెక్రటరీగా డి ఉమను ఎన్నుకున్నారు. అనంతరం పీఆర్‌జీటీఏ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో దివ్యాంగులకు ప్రత్యేక ఓపీని ప్రారంభించినట్లు సూపరిండెంటెంట్‌ చంద్రశేఖర్‌ శుక్రవారం తెలిపారు. నిత్యం వేలాది మంది రోగులు ఎంజీఎంకు వస్తారన్నారు. ఈ క్రమంలో దివ్యాంగులు వైద్యచికిత్సలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఓపీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎంజీఎం ఆర్‌ఎంఓలు మురళీ, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

హరిచందనకు వీర్‌గాథ్‌ అవార్డు



హరిచందనను అభినందిస్తున్న డీఈఓ అబ్దుల్‌ హై

హసన్‌పర్తి: జాతీయ స్థాయి వీర్‌గాథ్‌ 3.0 అవార్డుకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్‌ పదో తరగతి విద్యార్థి ఆకుతోట హరిచందన ఎంపికైంది. ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్‌, ధర్మేంద్రప్రదాన్‌ చేతుల మీదుగా రూ.10వేలు నగదుతో పాటు ప్రశంస పత్రం అందుకుంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతరామ్‌ కర్ణ తెలిపారు.అలాగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హరి చందన పాల్గొంటున్నట్లు చెప్పారు. 'ఝాన్సీ లక్ష్మీబాయ్‌ కలలోకి వచ్చి నీవు దేశానికి సేవలు ఎలా చేస్తావు' అనే అంశంపై ఇటీవల నిర్వహించిన పెయింటింగ్‌లో హరి చందన పాల్గొంది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 37 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు శాంతరామ్‌ కర్ణ తెలిపారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి హరిచందనకు అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ అబ్దుల్‌ హై, జిల్లా నోడల్‌ అధికారి శ్రీనివాసస్వామి.. హరిచందనను అభినందించారు. హరిచందన వీర్‌గాథ్‌ 3.0 జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు.

మీడియా పాయింట్‌ నిర్మాణ స్థలం మార్చాలి



ఇంజనీరింగ్‌ అధికారులతో మాట్లాడుతున్న జగ్గారావు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో మీడియా పాయింట్‌ అదనపు భవన నిర్మాణ స్థలాన్ని మార్చాలని సమ్మక్క-సారాలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఇంజనీరింగ్‌ అధికారులను కోరారు. దేవాదాయశాఖ ఆవరణలో ఉన్న మీడియా పాయింట్‌ ఇరుకుగా ఉన్న నేపథ్యంలో జాతర కవరేజ్‌ కోసం వచ్చే ప్రింట్‌, ఎలక్ట్రానిక్‌ మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లు ఇబ్బందులు పడుతున్నారని, అదనపు మీడియా పాయింట్‌ నిర్మించాలని కలెక్టర్‌ ఆదేశాల మేరకు పీఆర్‌శాఖ అధికారులు శుక్రవారం మీడియా పాయింట్‌ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ భవనాన్ని వనం పూజ మందిరం సమీపంలో నిర్మించడం వల్ల జాతర సమయంలో పూజ కార్యక్రమాలకు అంతరాయం కలుగుతుందని, దీనిని క్యూలైన్‌ పక్క స్థలంలో నిర్మించాలని జగ్గారావు కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పనులు నిలిపి వేశారు.

6 నుంచి ఇలవేల్పుల సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూజారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు మేడారంలో ఆదివాసీల (కోయ) ఇలవేల్పుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్‌ క్యూరేటర్‌ కుర్సం రవి తెలిపారు. శుక్రవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో మ్యూజియం క్యూరేటర్‌ రవి, పీసా కోఆర్డినేటర్‌ ప్రభాకర్‌, పూజారుల ఆధ్వర్యంలో ఇలవేల్పుల సమ్మేళనం ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 21 నుంచి 24 తేదీ వరకు మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులకు తెలిసేలా ఆదివాసీ ఇలవేల్పుల జాతరల సమ్మేళనం ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా చిర్రమల్లకు చెందిన సమ్మక్క సారక్క పూజారి చందా వీరయ్య, ఏపీలోని సీతారామరాజు జిల్లా కొమ్మూరు చెందిన ఆర్తి బిడ్డ నాగుల శ్రీరాములు, పూజారులు, వడ్డెలు పాల్గొన్నారు.

విద్యుత్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జాన్సన్‌

● టీఆర్‌వీకేఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌

హన్మకొండ : విద్యుత్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జాన్సన్‌ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో టీఆర్‌వీకేఎస్‌ ట్రాన్స్‌కో వరంగల్‌ జోనల్‌ స్థాయి సమావేశం జరిగింది. ట్రాన్స్‌కో టీఆర్‌వీకేఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మాడ దేవేందర్‌ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కె.వి. జాన్సన్‌ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్‌కార్మికుల సమస్యల పరిష్కారానికి నాయకత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో విద్యుత్‌ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం లభించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో విభాగం టీఆర్‌వీకేఎస్‌ కంపెనీ కార్యదర్శి పులుసు రాములు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అక్బరుద్దీన్‌, ఎన్పీడీసీఎల్‌ శాఖ కార్యదర్శి బండారి ప్రభాకర్‌, సంఘం నాయకులు రాజేందర్‌, రబ్బానీ, రాజనరేందర్‌, రామకృష్ణ, రాజు, కందికొండ వెంకటేష్‌, హరిప్రసాద్‌, జయచందర్‌, మౌలానా నాయక్‌, నాగరాజు, వెంకన్న, రెడ్యా, కరుణాకర్‌, వెంకట్‌, హరిప్రసాద్‌, రాజేష్‌, రమేష్‌, రాజేందర్‌, బాలాజీ, రజినీకాంత్‌, సంజీవ, రఘుపతి, చంద్రుడు, భాస్కర్‌, రాజేందర్‌, రఘు, రాధాకృష్ణ పాల్గొన్నారు.